క్లుప్తంగా

నేడు విగ్రహాల ప్రతిష్టాపన

రామకుప్పం: అత్తికుప్పం గ్రామంలోని దత్తము నీంద్ర ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. గురువారం ఆశ్రమ పీఠాధిపతి పరమహంస ఆధ్వర్యంలో దత్తాత్రేయ, సద్గురు మునీంద్రస్వామి విగ్రహాల పునఃప్రతిష్ట, వరద గణపతి, లలితా పరమేశ్వరి అమ్మవార్ల నూతన విగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

వేమన విగ్రహానికి నివాళి


నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

పలమనేరు: ఉగాదిని పురస్కరించుకుని తెలుగుభాషలో సామాన్యునికి అర్థమైయ్యేలా పద్యాలను రచించిన వేమనకు స్థానిక యోగివేమన చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, రెడ్డి సంఘం నేతలు నివాళులర్పించారు. స్థానిక మార్కెట్ కమిటీ సమీపంలోని వేమన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చెంగారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి న్యాయవాదుల విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల విధులను గురు, శుక్రవారాల్లో బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు విజయకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. విజయవాడలో న్యాయవాది వి.భగవాన్‌ను పోలీసులు బెదిరించి, దాడి చేసినందుకు నిరసనగా రెండు రోజులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సారా స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పులిచెర్ల(కల్లూరు): సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 40 లీటర్ల సారా, 100 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు పులిచెర్ల ఎస్ఈబీ ఎస్ఐ కవీశ్వరనాయుడు తెలిపారు. సదుం మండలం ఊటుపల్లె పంచాయతీ బొమ్మిరెడ్డి గారిపల్లెకు చెందిన జయరామిరెడ్డి (65) తన ఇంట్లో సారాతో పాటు నల్ల బెల్లం కలిగి ఉన్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో సీఐ శ్రీనివాసమూర్తి, హెచ్‌సీ సుధాకర్ పాల్గొన్నారు.

రేపు పీఈఎస్ స్నాతకోత్సవం

గుడుపల్లె: పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఈనెల 24వ తేదీ 15వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణరావు తెలిపారు. దేశంలోనే ప్రఖ్యాతగాంచిన కార్డియోథొరాపిక్ సర్జన్ డాక్టర్ వివేక్‌జావలి, పీఈఎస్ చాన్సలర్ ఎంఆర్ దొరస్వామి చేతుల మీదుగా 150 మంది వైద్య విద్యార్థులకు పట్టాలు అందిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులకు మెడల్స్ అందజేస్తామని తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


అటవీ అధికారులతో గ్రామస్తులు

రామకుప్పం: మండలంలోని నారాయణపురం తండా అటవీ పరిధిలో ఒంటరి ఏనుగు దాడులో దెబ్బతిన్న పంటలను అటవీ అధికారులు బుధవారం పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఏనుగుల కదలికలన ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి వెంట ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్, వైఎస్సార్ సీపీ మండల కోకన్వీనర్ చంద్రారెడ్డి, నాయకులు వెంకటేశు నాయక్, చెంగారెడ్డి, చక్రి, లోకేష్ నాయక్ ఉన్నారు.

నేడు గృహ సారథులకు శిక్షణ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులకు గురు, శనివారాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, సచివాలయాల కన్వీనర్ ముర్వత్ బాషా తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, వలంటీర్లు తప్పక హాజరుకావాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చిత్తూరు రూరల్: నగరంలోని న్యూబాలాజీ కాలనీలో శ్రీపంచముఖ వినాయకస్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం దాత పార్థసారథినాయుడు రూ.60 వేలు విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన గ్రానైట్‌ను అందిస్తానన్నారు. ఆలయ నిర్వాహకులు శక్తివేల్‌స్వామి, మాధవనాయుడు, భానుమతి, అర్చకులు సాయిలు ఆయనను సన్మానించి స్వామి ఆశీర్వచనాలు అందించారు.

ఉగాది వేడుకలు

- ఆలయాల్లో పంచాంగ పఠనం
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- ఒకరికొకరు శోభకృత నామ సంవత్సర శుభాకాంక్షలు
- పూర్వికుల సమాధుల వద్ద పూజలు


బైరెడ్డిపల్లె: ద్రాక్ష అలంకరణలో బాటగంగమ్మ


ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ దంపతులు


పలమనేరు: సీతారామాంజనేయులు


చౌడేపల్లెలో పంచాంగ పఠనం


పుంగనూరు: అలంకరణలో విరూపాక్షి మారెమ్మ


కుప్పం: దీకేపల్లెలో పూర్వికుల సమాధుల వద్ద పూజలు


కుప్పంలో..

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాలు జరిగాయి. ఉగాది పచ్చడిని ఒకరికొకరు అందజేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉగాది పచ్చడి ప్రాశస్త్యాన్ని వివరించి షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన పచ్చడిని పట్టణంలో పంపిణీ చేశాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాగా ఈ ప్రాంతంలో ఉగాదికి రెండో రోజైన గురువారం వరుసతొడగు అనే పండగను ఘనంగా జరుపుకోనున్నారు.

స్వగ్రామంలో ఎమ్మెల్యే ఉగాది వేడుకలు

పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ స్వగ్రామం తోటకనుమలో కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగను జరుపుకున్నారు. పంటలు బాగా పండి రైతులు, నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

పుంగనూరు: తెలుగువారి తొలి పండుగ ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి, వాసవిదేవి, బోగనంజుండేశ్వరస్వామి, చాముండేశ్వరి, విరూపాక్షి మారెమ్మ, శ్రీసాయినాథుని ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. సోమేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేశారు. పితృదేవతల సమాధుల వద్ద కొత్త బట్టలు పెట్టి పూజలు చేశారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయం, శ్రీకోదండరామస్వామి, శ్రీకన్యకాపరమేశ్వరి, చీలంపల్లె శ్రీకపిలేశ్వరస్వామి ఆలయం, నాగిరెడ్డిపల్లెలోని సోమేశ్వరస్వామి, పాతపేట చెన్నకేశవస్వామి, కడపనత్తం నల్లగుండ్రాయస్వామి, కోట్రేపల్లె కాళభైరవేశ్వరస్వామి, కార్వేటికొండపై వెలసిన శ్రీధ్యానాభిరామస్వామి, నెల్లిపట్లలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంటింటా పిండి వంటలతో గుమగుమలాడాయి. బంధు మిత్రులతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

రొంపిచెర్ల/సదుం/పెద్దపంజాణి: ఆయా మండలాల్లో పూర్వీకులకు కొత్త బట్టలు పెట్టి పూజలు చేశారు. ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

కుప్పం/గుడుపల్లె: మండలంలోని శ్మశానాల్లో పెద్దల సమాధుల వద్ద పూజలు చేశారు. బంధువులు, స్నేహితులకు ఉగాది పచ్చడి పంచుతూ శుభాకాంక్షలు తెలిపారు. కాగా గురువారం జంతు బలులు ఇచ్చి విందు భోజనాలు ఏర్పాటు చేయనున్నారు.

వి.కోట: మండలంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పితృదేవతలకు దస్తులు పెట్టి పూజలు చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

చౌడేపల్లె: మండలంలోని చారాలలో వెలసిన చెన్నకేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం పంచాంగ పఠనం చేశారు. ఆనందాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు


పులిచెర్ల: లక్ష్మీ నరసింహస్వామి సేవలో భక్తులు


రామకుప్పం: పూజలందుకున్న గంగమ్మ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అలంకరణ చేశారు. వెంకటదాసరపల్లె ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర దంపతులు, గ్రామస్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు అనంతాచార్యులు తీర్థప్రసాదాలను అందజేసారు.

రామకుప్పం: స్థానిక గ్రామదేవత గంగమ్మ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా కోనేటిరాయస్వామి గ్రామోత్సవం


తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

గంగవరం: ఉగాది పండుగను పురస్కరించుకుని కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో బుధవారం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత కోనేటిరాయస్వామి తిరుచ్చిపై గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన శ్రీమలాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏఎంసీ చైర్మన్‌గా అమరనాథరెడ్డి



పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని కోటగడ్డకు చెందిన అమరనాథరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా చంద్రమాకులపల్లెకి చెందిన వరుణకుమారిని నియమించారు. అలాగే డైరెక్టర్లుగా చిన్నరెడ్డెప్ప, ఎం.తులసెమ్మ, టి.ఉమాదేవి, ఎస్.కవిత, డి.సుజాత, ఎల్.సుబ్రమణ్యం, పి.జ్యోతి, ఎస్.సాదిక్‌బాషా, బి.రవికుమార్‌నాయక్, ఎస్.శోభారాణి, ఎం.రవిచంద్రారెడ్డి, కె.బాలసుబ్రమణ్యం, కె.రామదాస్‌ను నియమించారు. తనను చైర్మన్‌గా నియమించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలకు అమరనాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులు, వ్యాపారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఆస్తి పన్నుకు వడ్డీ మినహాయింపు

పుంగనూరు: ఆస్తి పన్నుకు ఈ నెల 31వ తేదీ వరకు వడ్డీ మినహాయింపు ఉంటుందని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ ఒకటి నుంచి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. బకాయిదారులు తక్షణమే పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి


అభినందన సభలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సేవల్లో రాష్ట్రంలో మొదటి స్థానం సాధించిన సందర్భంగా బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరయ్యారు. కేక్ కట్ చేసి వైద్యులను సత్కరించారు. వి.కోట ఆస్పత్రిలో వైద్య సేవలు బాగుండడంతో ఓపీల సంఖ్య పెరిగాయని తెలిపారు. అదనపు గదులు నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అలాగే పోస్టుమార్టం కేంద్రం మంజూరైందని.. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మండలంలో మరో పీహెచ్‌సీ మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, కిజియారాణిలను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్‌ఖాన్, సింగిల్ విండో చైర్మన్ ధవ నంభక్త, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కౌండిన్య నదిలోకి కోళ్ల వ్యర్థాలు



కోళ్ల వ్యర్థాలను నదిలో పడేయడానికి తీసుకొచ్చిన వ్యక్తి, కలుషితమైన నీరు

పలమనేరు: మండలంలోని కౌండిన్య నదిని కొందరు కలుషితం చేస్తున్నారు. పట్టణంలోని పలువురు చికెన్ దుకాణ నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలు, మృతి చెందిన కోళ్లను సంచుల్లో తీసుకొచ్చి బోడిరెడ్డిపల్లె కౌండిన్య నదిలో పడేస్తున్నారు. ఈ నీళ్లను తాగే పశువులకు వ్యాధులు తప్పడం లేదని పలువురు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పట్టణానికి ఆనుకొని ఉన్న పెద్దచెరువు లోనూ రాత్రి పూట కొందరు కోళ్ల వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో చెరువు కట్టపై దుర్వాసన వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాటాదారులకు వెండి నాణేల పంపిణీ


వెండి నాణేలు అందజేస్తున్న చంద్రబోస్

పలమనేరు: పట్టణంలోని సహకార సంస్థ ది బాలాజీ సూపర్‌బజార్ వాటాదారులకు బుధవారం ఆ సంఘం కార్యాలయం వద్ద వెండి నాణేలను పంపిణీ చేశారు. ఏటా డివిడెంట్ రూపంలో వెండి కాయిన్స్‌ను అందిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్ తెలిపారు.



గజరాజులకు పూజలు

ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని ననియాల ఎకో టూరిజంలో శిక్షణ పొందిన ఏనుగులు వినాయక్, జయంత్‌లను బుధవారం పూలతో అలంకరించి పూజలు చేశారు. అటవీ అధికారులు వాటికి ఇష్టమైన ఆహారాన్ని పెట్టారు.

–రామకుప్పం

31న ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ప్రారంభం

- రూ.10 కోట్లతో నిర్మించిన దాత
- అగర్‌బత్తీల ప్లాంట్ విస్తరణ పనులు పూర్తి
- రోజుకు 40 వేల ప్యాకెట్ల ఉత్పత్తి



తిరుపతి రూరల్: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవెంకటేశ్వర గోసంరక్షణశాలలో నూతనంగా నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు, అగర్‌బత్తీల ప్లాంట్ విస్తరణ కేంద్రాన్ని ఈ నెల 31న ప్రారంభించనున్నారు. ఈ నెల మొదటి వారంలోనే ప్రారంభించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వాయిదా పడింది. కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో ఈ నెల 31న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నారు.

రూ.10 కోట్లతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్

టీటీడీ పరిధిలోని గోశాలలో ప్రస్తుతం మూడు వేలకు పైగా పశువులను సంరక్షిస్తున్నారు. వీటికి రోజుకు దాదాపు 2500 నుంచి 3 వేల కిలోల వరకు దాణా అవసరమవుతోంది. అంతేకాకుండా వాటి ఆరోగ్య సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు, పాలల్లో నాణ్యమైన వెన్నశాతం ఉండేలా పోషకాలతో నిండిన దాణా అందించాలని టీటీడీ పాలక మండలి సభ్యులు, ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అందులో భాగంగా ఎస్వీ వెటర్నరీ వర్సిటీ సాంకేతిక భాగస్వామ్యంతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రూ.10 కోట్ల ఖర్చయ్యే ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు దాత ముందుకు వచ్చారు. టీటీడీ పైసా ఖర్చు లేకుండా దాత సహకారంతోనే దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రోజుకు 4 వేల నుంచి 6 వేల కిలోల దాణాను తయారు చేసేందుకు అవకాశం ఉంది.

డిమాండ్‌కు అనుగుణంగా అగర్‌బత్తీల తయారీ

టీటీడీ పరిధిలోని ఆలయాల్లో దేవుళ్ల సేవకు ఉపయోగించిన పూలతో తయారు చేస్తున్న అగర్‌బత్తీలకు దేశ, విదేశాల్లోని భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దర్శన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో తయారు చేస్తున్న ఈ అగర్‌బత్తీలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అగర్‌బత్తీలను అందించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో ప్లాంట్ విస్తరణ పనులను దర్శన్ సంస్థ చేపట్టింది. రోజుకు 40 వేల నుంచి 45 వేల ప్యాకెట్ల అగర్‌బత్తీల తయారీకి ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం రోజుకు 15 వేల ప్యాకెట్ల అగర్‌బత్తీలను మాత్రమే తయారు చేస్తున్నారు. వీటిని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన గంటలోనే అమ్ముడుపోతున్నాయి. అంతేకాకుండా టీటీడీ ఆలయాల నుంచి ప్రస్తుతం రోజుకు 700 నుంచి 1000 కిలోల పూలను సేకరిస్తున్నారు. పెరిగిన అగర్‌బత్తీల సామర్థ్యం మేరకు ప్రతి రోజూ 1700 కిలోల పూలు అవసరమవుతాయని టీటీడీ అధికారులు గుర్తించారు. దీంతో తిరుపతితో పాటు ఒంటిమిట్ట, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయిగుంట ఆలయాల నుంచి పూలను సేకరించనున్నట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు.




అర్ధగిరి క్షేత్రంలో పంచాంగ పఠనం


అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో అర్చకులు తెలుగు నూతన శోభ కృత్ నామ సంవత్సరం, తెలుగువారి సంప్రదాయాలకు ప్రతి రూపమైన ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణాన్ని పఠనం చేశారు. మండలంలోని పలు దేవాలయాల్లో అర్చకులు, భక్తులు ఉగాది పండుగను ఆనందంగా నిర్వహించారు. అర్ధగిరి క్షేత్రంలో ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వీరాంజనేయస్వామికి అభిషేకం, అర్చనలు, పూజలు చేయించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు నూతన తెలుగు సంవత్సర పంచాంగం చదివి వినిపించారు. టి.పుత్తూరు శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు శంకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు నిర్వహించి అర్చకులు పంచాంగ పఠనం చేయించారు. అనంతరం భక్తులకు తీపు, చేదు, పులుపుతో కూడిన పచ్చడి పంచిపెట్టారు.